15022025-MAI-04_Layout 1 2/15/2025 3:34 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# వాటా కోసం బీసీల పోరుబాట



అస్కాని మారుతీసాగర్
90107 56666

**'ఎవరెంతో వారికంత' అన్నది అత్యంత ప్రజాస్వామికమైన డిమాండ్. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సందర్భంలోనూ భవిష్యత్తు గురించిన చర్చలు జరిగాయి. 50 శాతానికి పైగా బీసీలు మన రాష్ట్రంలో ఉన్నారు. సహజంగానే వీరికి అన్ని రంగాల్లో మంచి వాటా దక్కుతుందని, దక్కి తీరుతుందని అంతా భావించారు. నాటి ఉద్యమ నాయకత్వం కూడా అదే ధోరణితో ఉన్నది. బీసీలు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అటు కోకాపేటలోను, ఇటు ఉప్పల్ భగాయత్‌లోనూ అనేక కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు ఇచ్చి, కొన్ని కులాల వారికి నిధులు సైతం కేటాయించారు. బీసీలు తలెత్తుకుని జీవించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం పట్ల అప్పట్లో బీసీ కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.**

బీసీలు ఎంతమంది ఉన్నారు? వారిలో ఎవరికెంత వాటా దక్కుతున్నది? ఏ ప్రాతిపదికన ఈ కేటాయింపులు జరుగుతున్నాయి? ఇవన్నీ ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. బీసీలు అనగానే రెండు మూడు సామాజిక వర్గాల వారి పేర్లనే అందరూ చెప్తున్నారు. 130కి పైగా బీసీ కుల సమూహాలున్నాయి. పార్టీల సీట్ల కేటాయింపు, నామినేటెడ్ పోస్టుల కేటాయింపులు, విద్య, ఉద్యోగ, ఉపాధి వంటి అంశాల్లో ఆ రెండుమూడు సామాజిక వర్గాలే వారే కన్పిస్తున్నారు. వారి గొంతే వినిపిస్తున్నది. మరి మిగిలిన బీసీ కులాల పరిస్థితి ఏమిటి?

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణనపై విమర్శలు వెల్లువెత్తడంతో ప్రతిపక్షాలు, బీసీ సంఘాల ఒత్తిడికి తలొగ్గి రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. డెడికేటెడ్ కమిషన్ నిక్కచ్చిగా సర్వే చేస్తే ఎవరి జనాభా ఎంత ఉందో స్పష్టంగా తెలిపోతుంది. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలులో అది ఎంతవరకు సాధ్యమవుతుందోనని బీసీ కులాలు ఆందోళనలో ఉన్నాయి. కులగణన విషయంలో ప్రభుత్వం కచ్చితమైన వివరాలను వెల్లడించడంతోపాటు ఆయా కులాలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

> **కొన్ని బీసీ కులాల ప్రజలు తమ సంఖ్య విషయంలో ఇన్నాళ్లు చెప్పుకుంటూ వచ్చిన లెక్కలకు, ప్రస్తుత లెక్కలకు మధ్య ఎంతో తేడా కనిపిస్తున్నది. ఇదే ఇలా ఉంటే, మరి ఎవరూ పెద్దగా పట్టించుకోని కులాల సంఖ్య సంగతేంటి? వారి గురించి ఎవరూ ఎందుకు మాట్లాడటం లేదు? జనాభా తక్కువగా ఉన్న వారిని పట్టించుకోరా?**

వీరిని ఓటర్లుగా మాత్రమే చూసే ధోరణి చాలా రాజకీయ పార్టీల్లో కనిపిస్తున్నది. అందుకే పదవుల పంపకాల సందర్భంలో కూడా కొందరికే ఆ ఫలాలు దక్కుతున్నాయి. రాష్ర్టానికి అప్పుడు, ఇప్పుడు కూడా చెరువులే ప్రధాన ఆధారం. కాకతీయులు, ఆ తర్వాత వచ్చిన గోల్కొండ నవాబులు, వీళ్ల తర్వాత వచ్చిన నిజాం నవాబులు. వారి వారి కాలాల్లో తెలంగాణను బతికించినవి చెరువులే. అంతెందుకు, ఉమ్మడి రాష్ట్రపు నిర్లక్ష్యపు నీడలో తెలంగాణను కాపాడుకున్నవి కూడా చెరువులే. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటైన ప్రభుత్వం కూడా చెరువులకే తొలి ప్రాధాన్యం ఇచ్చింది. ఆ చెరువుల నిర్మాతలైన సగరుల (ఉప్పరుల) గురించి ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఇందుకు ప్రధాన కారణం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వారు వెనుకబడి ఉండటమే. ఎంతో ఘన చరిత్ర కలిగిన షట్ చక్రవర్తులలో సగర చక్రవర్తి వారసుడైన భగీరథుని వంశస్థులుగా గుర్తింపు పొందిన సగరులు మొదటగా ఉప్పు తయారీదారులుగా, చెరువులు, ప్రాజెక్టులు నిర్మించే వారిగా, ఆ చెరువుల నీటిని విడుదల చేసే నీరటికారులుగా, ప్రస్తుతం నిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న వారిగా ముందుకు సాగుతున్నారు. అలాంటి ఉప్పరుల గురించి పాలకులు నామమాత్రంగా మాత్రమే ప్రస్తావిస్తున్నారు. జీవజాలానికి ఆధారం అవుతున్న ఇలాంటి కులాల గురించి ఆలోచించాల్సిన అవసరం రాజకీయ పార్టీలకు ఉన్నది.



వీళ్లే కాదు ఇంకా బీసీల్లో అత్యంత దుర్భర జీవితాలు వెళ్లదీస్తున్న వారు ఎందరో ఉన్నారు. వారంతా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా ఉన్నవారే. కొన్ని బీసీ కులాల వారు భిక్షాటన చేసుకుంటున్నారు. మరికొన్ని సామాజిక వర్గాల వారు అయితే కేవలం ఓటర్లు గానే మిగిలిపోయారు. రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి వంటి రంగాల్లో వారికి రావాల్సిన వాటా రావడం లేదు.

> **నేటి కమ్యూనికేషన్ ప్రపంచంలో వృత్తులు పోయాయి. ఉపాధులు పోయాయి. కొత్త తరహా వ్యవస్థలు వచ్చాయి. ఆర్థిక వనరులు మారిపోయాయి. వాటిని అందుకున్న వారు నిలబడుతున్నారు. అందుకోలేని వారు ఎటు పోయారో, పోతున్నారో ఎవరి వద్దా లెక్కలు ఉండటం లేదు.**

అందువల్ల బీసీల్లో అత్యంత వెనక్కు నెట్టేయబడుతున్న వారు తమ బలాన్ని ప్రత్యక్షంగా ఈ పాలకులకు చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇందుకుగాను వారు ఏకం కావాల్సిన అవసరం, అనివార్యత ఉన్నది. ఎప్పుడైతే ఐక్యతను చాటుతారో వారి గురించి ఆలోచించే అవసరం ఈ పాలకులకు అనివార్యమవుతుంది.

ఈ క్రమంలోనే సగరులు ఒక అడుగు ముందుకు వేసి జనగర్జన ద్వారా శంఖారావం పూరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 16న 'సగర శంఖారావం' పేరుతో వేలాదిమందితో నాగర్‌కర్నూలులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచబోతున్నారు. ఇంకెన్నాళ్లీ నిర్లక్ష్యం అంటూ నినదించబోతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ కులానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలనేది ఈ బహిరంగ సభ ముఖ్య ఉద్దేశం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే రెండు లక్షల మంది వరకు సగరులున్నారు. తెలంగాణవ్యాప్తంగా 5 నుంచి 7 లక్షల వరకు వీరి జనాభా ఉంటుంది. ఇక నుంచి అన్ని రంగాల్లో తమకు రావాల్సిన వాటా ఇచ్చి తీరాల్సిందేననే డిమాండ్‌ను అన్ని పార్టీల ముందు పెట్టబోతున్నారు. తమతో పాటు కలిసివచ్చే వారిని కలుపుకొని 'ఎవరెంతో వారికంత' అనే సహజ న్యాయ సూత్రాన్ని అమలు చేసుకోవాలని అత్యంత వెనుకబడిన బీసీ సమాజాన్ని సగరులు కోరుతున్నారు. సగరుల శంఖారావం సభ నిర్వహిస్తున్న సందర్భంగా విస్మరణకు గురైన బీసీలు చైతన్యమై తమ హక్కులు సాధించుకోవాలని సూచిస్తూ తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సగరుల శంఖారావం సభకు యావత్ తెలంగాణ సమాజం మద్దతునివ్వాలని కోరుతున్నారు. సగరులు భారీ సంఖ్యలో సభకు హాజరై తమ ఆకాంక్షలను వ్యక్తీకరించి అనేక కులాలకు మార్గ నిర్దేశకులుగా మారి బీసీ సమాజాన్ని మరింత చైతన్య పరచాలి.

> ఎంతో ఘన చరిత్ర కలిగిన షట్ చక్రవర్తులలో సగర చక్రవర్తి వారసుడైన భగీరథుని వంశస్థులుగా గుర్తింపు పొందిన సగరులు మొదటగా ఉప్పు తయారీదారులుగా, చెరువులు, ప్రాజెక్టులు నిర్మించే వారిగా, ఆ చెరువుల నీటిని విడుదల చేసే నీరటికారులుగా, ప్రస్తుతం నిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న వారిగా ముందుకు సాగుతున్నారు. అలాంటి ఉప్పరుల గురించి పాలకులు నామమాత్రంగా మాత్రమే ప్రస్తావిస్తున్నారు.

**(వ్యాసకర్త: చైర్మన్, తెలంగాణ సగర భగీరథ ఆత్మగౌరవ భవన ట్రస్ట్)**



# పీడించడమే కాంగ్రెస్ నైజం



నన్నపనేని నరేందర్

**కేసీఆర్ ఆశ, శ్వాస తెలంగాణే. నాడైనా, నేడైనా, రేపైనా తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ప్రజల సంక్షేమమే ఆయనకు ముఖ్యం. రాష్ట్రం సిద్ధించిన నాటి నుంచి పదేండ్ల వరకు తెలంగాణకు కంచెలా కాపలా కాశారు. కానీ, ఎన్నికల్లో అంతా తారుమారైంది. పాలిచ్చే బర్రెను తెగనమ్ముకున్న ప్రజలు దున్నపోతును తెచ్చుకున్నారు. ఏరి కోరి తెచ్చుకున్న ఆ దున్నపోతు నేడు ఎగిరెగిరి తంతుంటే అరిగోస పడుతున్నారు.**

మాట ఇవ్వడం, మాట మార్చడం, మాయ చేయడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ నైజాన్ని దగ్గరుండి చూశారు. అందుకే, కాంగ్రెస్‌కు పాలన చేతకాదని, ప్రజలను పీడించడం మాత్రమే తెలుసని హెచ్చరించారు. ఆయన అంచనాలను ఏమాత్రం తీసిపోకుండా రేవంత్ పాలన సాగుతున్నది. అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వర్గాన్నీ సంతృప్తి పరచలేకపోయింది. గడిచిన ఏడాది కాలంలో రోడ్డెక్కని వర్గం అంటూ లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. పాలన చేయడం చేతకాని కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచి ప్రచారార్భాటాలతోనే కాలం గడుపుతున్నారు. అబద్ధాలు ప్రచారం చేయడం, గత ప్రభుత్వంపై అభాండాలు వేయడం, హామీలు అమలు చేయలేక తప్పించుకుని తిరగడం రేవంత్ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది.

ఆరు గ్యారెంటీలు, 420 హామీలను మెట్లుగా మలచుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ ఈ 420 రోజుల్లో ఒక్కటంటే ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు. మహిళలకు ఉచిత బస్సును అమలు చేసి, బస్సుల సంఖ్యను తగ్గించింది. బస్సుల్లో మహిళలు కొట్టుకుంటుంటే వినోదం చూస్తున్నది. కోతలు, కొర్రీలు పెట్టి రుణమాఫీ అరకొరగా చేసి రైతులు రోడ్డెక్కేలా చేసింది. నాడు రైతులకు పెట్టుబడి సాయంగా ఉండేందుకు కేసీఆర్ తీసుకొచ్చిన బృహత్తర పథకం రైతుబంధును రేవంత్‌రెడ్డి ఎగతాళి చేశారు.

> **ఏడాదికి రూ.10,000 రైతులకు భిక్షగా వేస్తున్నారా? మూడు పంటలకు ఎందుకు సాయం చేయరని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే రూ.15,000 ఇచ్చి రైతుకు భరోసాగా నిలుస్తామని వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆయన నేడు నిజంగానే రైతులకు భిక్షం వేసినట్టు విడతల వారీగా పెట్టుబడి సాయం ఇస్తుండటం విడ్డూరం. మూడో పంటకు సాయం ఇవ్వాలని నాడు నిలదీసిన రేవంత్.. నేడు ఇప్పటికే ఏడాదిగా రైతు భరోసా ఎగ్గొట్టారు. ఇస్తున్న అరకొర సాయం నెల రోజులుగా సాగుతూనే ఉన్నది. మరో నెల అయినా ఈ ముచ్చట ఒడుస్తుందో, లేదో చెప్పలేం.**

ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి సరైన అవగాహన లేకుండా నోటికొచ్చినట్టు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు నేడు వాటిని అమలు చేయలేక మల్లగుల్లాలు పడుతున్నారు. ఎన్నికలకు ముందు తమకు సంపద సృష్టించడం తెలుసని, దానిని పేదలకు పంచడమూ తెలుసని బీరాలు పలికిన భట్టివిక్రమార్కనేడు ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నారు. సంపద సృష్టించడం తెలుసని చెప్పిన ఆయన.. ఇప్పుడు ఆర్థిక పరిస్థితి బాగాలేదని, పథకాలు అమలు చేయలేమని చెప్తూ సాకులు వెతుకుతున్నారు. అప్పులు భారీగా ఉన్నా తమకు ఇబ్బంది లేదని నాడు గప్పాలు కొట్టిన కాంగ్రెస్ నాయకులు నేడు మాటిమాటికీ అప్పుల ప్రస్తావన తీసుకొస్తున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు, ఇప్పుడు ఎడాపెడా అప్పులు చేస్తూ రాష్ట్ర ప్రజలపై ఎనలేని భారం మోపుతున్నారు. దీనిని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో రూ. లక్షన్నర కోట్లకుపైగా అప్పులు తెచ్చిన ప్రభుత్వం వాటితో ఒక్క కొత్త పథకమూ ప్రారంభించలేదు, ఒక్క ప్రాజెక్టూ కట్టలేదు. మరి ఆ రూ. లక్షన్నర కోట్లు ఏమైనట్టు?

తాము ఎన్నుకున్నది తమకు మంచి చేసే ప్రభుత్వమా? లేదా తమను ముంచే ప్రభుత్వమా? అన్నది తెలుసుకోవడానికి ప్రజలకు ఎక్కువ సమయం పట్టలేదు. అతి తక్కువ కాలంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నది. తాము ఏం కోల్పోయామన్నది ప్రజలు చాలా తక్కువ సమయంలోనే తెలుసుకున్నారు. ఏమార్చిన మార్పు తమ బతుకులనే కూల్చేయడంతో ఇప్పుడు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో చేసిన తప్పును తలుచుకుంటూ చింతిస్తున్నారు. సమయం కోసం వేచి చూస్తున్నారు. ఆ సమయం వచ్చినప్పుడు తమను ఇప్పుడు కాలితో తంతున్న దున్నపోతును ఎగేసి తంతారు.

**(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే, వరంగల్ తూర్పు)**

**దేశానికి పల్లెలు పట్టుగొమ్మలని జాతిపిత మహాత్మా గాంధీజీ చెప్పారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని గాంధీజీ మాటలకు అర్థం. జాతిపిత చూపిన బాటలో ఆయుధం పట్టకుండా ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్.. పోరాడి సాధించుకున్న తెలంగాణను గాంధీజీ ఆశయాల సాధన దిశగా పరుగులెత్తించారు. అతి తక్కువ కాలంలోనే పల్లెలు స్వయం సమృద్ధి దిశగా పయనించేలా చేశారు. కానీ, ఒక్క ఏడాదిలోనే తెలంగాణ పల్లెల పరిస్థితి తారుమారైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెల్లో పాలన గాడి తప్పింది.**

# ఎన్నికలకు భయపడి కాంగ్రెస్ పరార్



డాక్టర్ దూదిమెట్ల బాలరాజు




2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ సీట్లు పొందింది. కానీ,కాంగ్రెస్ సర్కార్ పల్లెల నడ్డి విరిచింది. రేవంత్‌రెడ్డి అధికారం పీఠం ఎక్కిన రెండు నెలలకే గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఇప్పటికే 14 నెలలు దాటినా పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం లేదు. అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు కాంగ్రెస్ సర్కార్‌కు తలకు మించిన భారంగా మారింది. ఆర్థిక పరిస్థితిని అంచనా వేయకపోవడం, అధికారంలోకి వచ్చాక ఆర్థిక వనరులపై దెబ్బ కొట్టడంతో పథకాల అమలుకు నిధుల కటకట ఏర్పడింది. ఆ దెబ్బ మొదటగా గ్రామీణ ప్రాంతాలపైనే పడింది. దీంతో అతి తక్కువ కాలంలోనే పల్లెలు కాంగ్రెస్ సర్కారుపై శివాలెత్తుతున్నాయి. పొరపాటున కాంగ్రెస్‌కు ఓట్లు వేసినామని, మరోసారి ఓట్లు అడిగితే కర్రు కాల్చి వాత పెడతామని గ్రామీణ ప్రజలు హెచ్చరిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ ఎన్నికలంటేనే వణుకుతున్నది. లేనిపోని కారణాలు చెప్తూ ఏడాదిగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నది.

పల్లెలు పచ్చగా ఉంటేనే తెలంగాణ బాగుంటుందని భావించిన కేసీఆర్ గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేశారు. గ్రామ పంచాయతీలకు నెల నెల రూ.275 కోట్లు, మున్సిపాలిటీలకు రూ.142 కోట్లు చొప్పున నిధులు విడుదల చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏటా రూ.3,300 కోట్లు, మున్సిపాలిటీలో రూ.1,700 కోట్లను కేటాయించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పేరిట రూ.20 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం గ్రామానికో ట్రాక్టర్ చొప్పున 12 వేలకు పైగా ట్రాక్టర్లు సమకూర్చారు. కానీ, ఏడాది కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అధ్వానంగా మారాయి. పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడంతో పాలన పడకేసింది. సర్పంచ్‌లు లేకపోవడంతో నిధులు లేక పల్లెలను పట్టించుకునే వారే లేకుండా పోయారు. సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ట్రాక్టర్ల డీజిల్‌కు కూడా డబ్బులు లేని దుస్థితి. పండగ పూట కూడా గ్రామాల్లో విద్యుత్తు దీపాలు వెలిగించలేని పరిస్థితి. నిధుల కటకట ఏర్పడటంతో వేసవిలో గ్రామాలు నీటి ఎద్దడిని ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొన్నది. మోటర్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతులు చేయిస్తేనే ఇంటింటికి నల్లా నీరు వస్తుంది. ఇప్పుడు ఆ పనులన్నీ చేయడానికి పంచాయతీల ఖజానాలో చెల్లిగవ్వ కూడా లేదు. అదే గ్రామ సర్పంచ్‌లు ఉండి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు.

ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుచేయని కాంగ్రెస్ ఎన్నికలంటేనే భయపడుతున్నది. ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని, గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని, ఊర్లలో తిరిగే పరిస్థితి లేదని, ఈ పరిస్థితుల్లో ఏ మోహం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలని ఇటీవల జరిగిన సమావేశంలో స్వయంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని భావిస్తున్న ప్రభుత్వం.. పల్లెలను కష్టాల ఊబిలోకి నెడుతున్నది. స్థానిక సం స్థల ఎన్నికలు ఎప్పుడు పెట్టినా గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌ను బొంద పెట్టడం ఖాయం.

**(వ్యాసకర్త: కార్పొరేషన్ మాజీ చైర్మన్)**

# కార్మిక పక్షపాతి ధర్మభిక్షం



సాయి లోహిత పులపా

నేడు ధర్మభిక్షం జయంతి




తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ఆర్యసమాజ్ సారథి, కార్మిక సంఘాల నేత, కమ్యూనిస్టు, జర్నలిస్ట్, హాకీ టీమ్ కెప్టెన్, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజా జీవితమే పరమార్థంగా ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న ఆదర్శ నాయకుడు.. ఇన్ని లక్షణాలు కలబోసిన వ్యక్తి బొమ్మగాని భిక్షం. ఒక చేత్తో దానం తీసుకుంటూ మరో చేత్తో ధర్మం చేస్తున్న భిక్షం పేరు ధర్మభిక్షం అని హైదరాబాద్ కొత్వాల్ రాజ్ బహద్దూర్ వెంకటరామారెడ్డి ప్రశంసించారు. నాటి నుంచి ఆయన ధర్మభిక్షంగా ప్రాముఖ్యత సంతరించుకున్నారు.

నల్లగొండ జిల్లా మునుగోడు మండలం వూకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్ పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15న ధర్మభిక్షం జన్మించారు. ధర్మభిక్షం విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచుకున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాలకు పాఠశాలలో ఉత్సవాలు జరపాలన్న ప్రధానోపాధ్యాయుడి ఆదేశాలను తోటి విద్యార్థులతో కలిసి బహిష్కరించారు. సామాజిక రుగ్మతలపై పోరాటానికి తన సహ విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. ఆంధ్రమహాసభతో మమేకమయ్యారు. 1942లో సీపీఐలో చేరారు. గోల్కొండ పత్రిక, ఆంధ్రపత్రిక, విజ్ఞాన్, ఉర్దూ పత్రికలకు విలేకరిగా పనిచేశారు.

నిజాంపై సాయుధపోరాటం మొదలు కావడంతో తుపాకి చేతబట్టి కదనరంగంలో అడుగు పెట్టారు. అరెస్టయి ఔరంగాబాద్, జల్నా జైళ్లలో ఐదేండ్లకుపైగా జైలుశిక్ష అనుభవించారు. జల్నా జైలులో పదివేల మంది ఖైదీలతో సమ్మె చేయించిన ఘనత ఆయనదే. గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన పోరాడారు. పలు కార్మిక సంఘాలను స్థాపించడంలో కీలక పాత్ర పోషించడంతో 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు పొందారు. దున్నేవాడిదే భూమి అన్నట్టుగా గీసేవాడిదే చెట్టు అన్న నినాదం చెప్పి వారి హక్కుల కోసం శ్రమించారు.

1952లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి హైదరాబాద్ అసెంబ్లీకి అత్యధిక మెజారిటీతో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తరువాత నకిరేకల్, నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. నల్లగొండ లోకసభ నియోజకవర్గం నుంచి 1991లో ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.1996లో లోక్‌సభ ఎన్నికలకు నల్లగొండ నుంచి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికీ ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం విశేషం. అత్యున్నతమైన చట్టసభలకు ఎంపికై కూడా సాధారణ జీవితం గడిపిన ధర్మభిక్షం 2011 మార్చి 26న మరణించారు.




## కాంగ్రెస్ కోసం ఇక పనిచేయను



"కాంగ్రెస్ కోసం ఇకపై పనిచేసేది లేదు. నా తండ్రి అడుగు జాడల్లో నడిచేందుకు చాలా ప్రయత్నించా. కానీ, అడుగడుగునా ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. ఇకపై కాంగ్రెస్‌కు పనిచేయకూడదని ఎంతో బాధతో, ఆవేదనతో నిర్ణయించుకున్నా."

**-ఫైసల్, అహ్మద్‌పటేల్ కుమారుడు**

## మార్పుకోసం!

ప్రజాస్వామ్య ముసుగులోన
పల్లెసీమ సభలు
ఎదురుపడుతున్నారు
ఎందుకో ప్రజలు!
ఆలనాపాలనా
ఆదరించలేకనా
చెప్పిన మాటలు
చేయలేనందుకా?

ఓట్లువేసినందుకు
పాట్లుపడే ప్రజలు
వారి మనసులు చెదిరితే
మారవా తలరాతలు!

దీపముండగానే
ఇల్లు సదురుకోండి
ప్రజల వంచన చేయని
పాలనివ్వండి!

ప్రభుతయేదైనా
ప్రజల సంక్షేమం
చేరికోరి తీర్చకుంటే
భవిష్యత్తు తీర్పు
మార్పుకోరు కదా!!

**- డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య**
**85558 99493**